# చెల్లాయి పెళ్ళి

చెల్లాయి పెళ్ళి విషయం తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు జలదరిస్తుంది. అప్పటికి పాతికేళ్ళ వాడనయి, ఎం. ఏ. ప్యాసయి, విజ్ఞానవంతుడ ననిపించుకొంటూ, ఆధునికత్వంలో అల్లుకుపోతున్న నేను, నాన్న మూఢత్వానికెలా అంగీకరించాను? ఆనాడు నా తెలివంతా ఏమయిపోయింది? నా వ్యక్తిత్వ మేమయింది? ఎంతో వాదించి చివరకు నెగ్గలేని ప్లీడరులా అయిపోయా నా నిముషం. ఆ నిముషం నాలో మూగతనం ఏర్పడిందా! నా తోడు నీడ అయిన చెల్లాయి, "అన్నయ్యా" అంటూ నా కోసం తహ తహలాడే నా చెల్లాయి. నా అమాయకపు చెల్లికి ఎంత అన్యాయం జరిగింది నే ఉండగా కూడా! అప్రయత్నంగా జయరామ్ చేతిలో పేపరు జారి క్రింద పడింది. దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో వాలిపోయాడు జయరామ్.

*　　　*　　　*

"అవును, నువ్వలా అంటావ్. ఏదో మొగ పిల్లాడివి; నువ్వు కాకపోతే నా కెవరని. ఉన్నదంతా ఊడ్చి నీ చదువు చెప్పించాను. ఆడపిల్లకి చదువెందుకు? ఉద్యోగాలు చేయాలా, ఊళ్ళేలాలా అని దాన్నలా వుంచేశాను. ఇప్పుడేం చేయమంటావ్? గుండెల మీద కుంపటిలా ఇంకా

ఎంత కాలం ఇలా ఉంచను దాన్ని. కాలం మారిన సంగతి నే గుర్తించలే దింతవరకూ. నీలాటి ఆధునిక యువకులంతా చదువుకున్న పెళ్ళాం కావాలనుకుంటారు. మరి కొందరు లక్షలున్న పిల్ల కావాలంటారు. ఈ కోర్కెలలో ఏదీ తీర్చలేని అసమర్థుణ్ణి నేనని నీకు చెప్పాలా! నే చేసిన తప్పుకి చెంపలేసుకుంటాను. దానికి చదువైనా చెప్పించని మూర్ఖుణ్ణి నేనే. కాదనటం లేదు కానీ, దాని పెళ్ళి విషయం నాకన్నా సంఘానికి ముఖ్యమయిపోయింది. సంఘాన్నెదిరించి బ్రతకలేను. ఇలాంటి అసమర్థుని కూతురికి అంతకన్న అదృష్టం ఎలా పడుతుంది! గర్భ దరిద్రుడు బంగారం తినాలని కోరుకుంటే ఎలా! సామాన్యులమైయుండి మహారాజ భోగం కావాలంటే ఎలా! నీ కెందుకు. నీ బాధ్యత కాదిది. నువ్వు కాదనకంతే .... ఇక నా యిష్టం....ఎన్నిసార్లంటావ్, దానికి చదువు చెప్పించకపోవటం నా తప్పే, నా తప్పే. ఎన్నిసార్లు చెప్పను...." అంటూ తల బాదుకున్న తండ్రి కళ్ళ ముందు ప్రత్యక్షమయ్యాడు జయరామ్‌కు.

"అలా వీల్లేదు నాన్నా! భగవంతుడు అందరికీ చదువు, అందం, ధనం ఇవ్వలేదు. కానీ అందరికీ హృదయమన్నది పెట్టాడు. నా ప్రాణ ముండగా నా చిన్నారి చెల్లాయి హృదయాన్ని కష్టపెట్టను. అన్నిటికి సంఘం, సంఘం అంటారు. సంఘమేం చేస్తుంది? మీదపడి కొడుతుందా? ఒకరంటారని ఎంతదాకా బ్రతకగలం? పెళ్ళి చేయలేదన్న సంఘం, ఈ పెళ్ళి చేశాడా! అని కూడా అంటుంది. మీ కెందుకీ గోల. చెల్లాయి పెళ్ళి బాధ్యత నాది" అని ఆనాడు తనెంత వాదించాడు. కానీ, ఏం లాభం, చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు తన మాట లెక్క పెట్టాడా తండ్రి! ఆ వృద్ధుడి మూర్ఖత్వానికి తన ఆశయాలు బలి అయిపోయాయంతే.

* * *

చెల్లాయి పెళ్ళయిపోయింది. ఆ పెళ్ళినాడు తను ఊళ్ళోనుంచి వెళ్ళిపోయాడు. "అన్నగారి కిష్టంలేదుట, ఈ సంబంధం చేయటం.

ఆ ముసలాయన పట్టట, అయినా ధాదస్తానికి అంతుడద్దూ! లక్షలున్నా యని, బంగారు బొమ్మని గుడ్డివాడికి కట్టబెట్టడమా! లక్షలు తింటుందా అది." దీర్ఘాలు తీశారు పెళ్ళి పెద్దలు. "ముసలాయన భారం ఒదిలింది పాపం" అనుకున్నారు పందిట్లో పనిమనుషులు. "అదృష్టాన్ని ఎవరడ్డ గలరూ, దాని అదృష్టం అంతటిదీ .... కళ్ళు లేకపోతేపోయే, అనుభవించ టానికి ఐశ్వర్యముంది" ముచ్చటించుకున్నారు ముసలి ముత్తయిదువలు. "అన్నగారు మహా గడసరి కాకపోతే తండ్రితో పోట్లాడి, నిక్షేపంలాంటి సంబంధం తేలేకపోయాడా ఏమిటి, అయితే చాలన్నట్లు ఊరుకున్నాడంతే" అని గుస గుస లాడింది తెలిసీ, తెలియని ఇరుగు పొరుగు.

చెల్లాయి పెళ్ళయింది. సంఘం కట్టుబాట్లకు, నిబంధనలకు ఒదిగి పోయిన చెల్లాయి వెళ్ళిపోయింది అత్తవారింటికి. ఏం చేస్తుంది వెళ్ళక. తన అదృష్టాన్ని అభినందించుకొని అడుగు పెట్టింది అత్తవారింట్లో. భగవంతుడు తనకు చేసిన అన్యాయాన్ని ఎవరడ్డుతారు! తన అందాన్ని చూచి తనే అసహ్యపడేది. ఎందుకీ అందం? అడవికాచిన వెన్నెల! తనని అవమానించటానికా భగవంతు డీ అందం ఇచ్చింది?

"నే నీ పెళ్ళి చేసుకోను నాన్నా!" అంటే, తల్లి లేని తనను పెంచిన తండ్రి హృదయం ఎంత బాధ పడుతుందో, "ఆ వృద్ధుడు అంతకంటే ఏంచేస్తాడు!" ఆ హృదయాన్ని కష్ట పెట్టలేక, ఈ సంఘాన్ని ధిక్కరించి అవివాహితగా ఉండలేక తల ఒగ్గిన చెల్లాయి జీవితం ఏమయింది? –

* * *

ఇరువై ఏళ్ళు నిండని చెల్లాయి జీవితంలో అన్ని అనుభవాలు అయిపోయాయి. పెళ్ళినాటి బ్రాహ్మణుల ఆశీర్వచనాలు ఇంకా చెవులలో గింగురుమంటున్నాయి. ముత్తైదువల దీవెనలు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అయితే అంతా ఉత్తిత్తి దీవెనలు దీవించారా! ఒక్కరి దీవెనా ఫలించదా!

కథా నిలయం

పసుపు కుంకుమలతో వెళ్ళిన చెల్లాయి, అవి లోపించి తిరిగి వచ్చింది. ఇంత అన్యాయం చేసిన భగవంతుణ్ణి వేలాది ప్రజలు నిత్యమూ ప్రార్థి స్తున్నారా! ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తాడని విశ్వ శిస్తున్నారు.

అయినా పెద్దలు చెప్పే "ఎవరి కర్మ వారిది" అనే కర్మ ఇదే నేమో! జయరామ్ కుర్చీ తండ్రి దగ్గరగా జరుపుకుని కూర్చున్నాడు.

"నాన్నా, మూర్ఖానికి అంతు లేదూ! ఈ అనుభవాలకి హద్దు లేవు. సంఘం అంటూ దాని జీవితాన్ని గంగపాలు చేశావు. ఇంకైనా ఊరుకో, పసుపు కుంకుమలతో శోభిల్ల వలసిన నా చెల్లెలి జీవితాన్ని అలా కానీయను. ఏమయినాసరే, నా చెల్లాయికి మళ్ళీ పెళ్ళి చేస్తాను. ఎవరే మంటారో చూస్తాను నాన్నా! ఒక పొరబాటును చూసి నవ్వగలరు.... కానీ ఒక మంచిని చూచి అభినందించలేరు. నా చెల్లాయి మీద సర్వహక్కులూ నాకున్నాయి. నాకీ ప్రజలతో పనిలేదు. ఈ సంఘం నన్నేమీ అవలేదు. నీ కీ ప్రాపంచిక విషయాలతో పనిలేదు. వృద్ధాప్యంలో "రామా" "కృష్ణా" అనుకుంటూ కూర్చో, అంతే .... చెల్లాయికి మళ్ళీ పెళ్ళి చేసి తీరుతా" నెక్టై సర్దుకుంటూ చెప్పాడు జయరామ్ తండ్రితో.

"బాబూ, నన్నిలా బ్రతకనియ్యరా, ఇంతకీ ఎవరి కర్మ వారిది. భగవంతుడే దాని కన్యాయం చేస్తే, మానవులం మనం దానికి ఏం న్యాయం చేయగలం! దానికి మళ్ళీ పెళ్ళేమిటి! భర్త పోయినదానికి పెళ్ళేమిటి! ఇదెక్కడేనా ఉందా! ఇది మళ్ళీ నాకే బాధరా. సంఘం నన్ను కాకుల్లా పొడుస్తుంది. నన్ను చూచి వెక్కిరిస్తుంది. నన్ను నింది స్తుంది. ఇలాంటి అవినీతి పనులకు పూనుకోకు. వృద్ధాప్యంలో ఎందుకు నాకీ కష్టాలు. నా తనువిలా వెళ్ళిపోనీ." దీనంగా చెప్పి, దీర్ఘాలోచనలో మునిగిపోయాడు వృద్ధుడు రామయ్య.

"నీకు తెలియదులే, నీ మాట ఇక జరుగదు. చెల్లాయికి పెళ్ళి తప్పదు, అంతే" ఛర ఛరా వెళ్ళిపోయాడు జయరామ్.

నెరసిపోయిన తల వెంట్రుకలలో చేతులు పోనిచ్చి, దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు రామయ్య. ఈ యుగంలో కూడా ఇంకా మూర్ఖ భావాలకి తావెక్కడుంది! నిజమే నా కొడుకన్నది .... ముమ్మాటికీ నిజం .... ఇరవై ఏళ్ళు నిండకుండా అంతా అయిపోతే, వందేళ్ళు ఎలా గడుస్తాయి? సంఘం ఎవరు? సంఘం ఎక్కడుంది? నేనే సంఘం. నాలో పిరికితనమే నన్ను కుదిపిస్తోంది! నన్ను ఎవరో నిందిస్తారేమోనని, ఒక అమాయికపు జీవితాన్ని నాశనం చేయడమా, ఛీ ఎంత అవివేకం! .... ఎంత స్వార్థం! .... ఎంత మూర్ఖం! నా కొడుకు దిట్టమైనవాడు. వాడికి సంఘంతో పనిలేదూ! వా డెలా సుఖంగా బ్రతుకుతున్నాడు? నిజమే ఇదీ నా మూర్ఖత్వమే. వాడి చెల్లాయి పెళ్ళి వాడిష్టం. కాటికాళ్ళు జాపుకున్న నాకు ఈ సంఘంతో ఈ మనుషులతో పనేమిటి? చెల్లాయి పెళ్ళి చెయ్యాల్సిందే .... అదీ అందరిలా సుఖంగా ఉండాల్సిందే. భగవంతుడు అన్యాయంచేస్తే మనం కూడా అన్యాయం చేయడమా!

చిఱునవ్వు ముఖంలో చిందులాడుతుండగా లేచాడు కుర్చీలోంచి రామయ్య. అప్పుడే వస్తున్న జయరామ్‌ను కౌగలించుకుని "బాబూ! నీ చెల్లాయి పెళ్ళి నీ యిష్టమే, తప్పకుండా దానికి మళ్ళీ పెళ్ళి చేయి. దాని జీవితంలో మళ్ళీ నవవసంతాలు పుష్పింపజేయి .... తప్పకుండా చెల్లాయి పెళ్ళి చేయి బాబూ!" ఒణికే కంఠంతో రామయ్య పూర్తిచేశాడు. ధన్యుణ్ణి నాన్నా! అని నవ్వుతూ జయరామ్ కుర్చీలో కూలబడ్డాడు.

ఏళ్ళు గడిచిపోతున్నాయి. చెల్లాయికి పెళ్ళి చేయలేకపోయాడు జయరామ్.

చెల్లాయి దగ్గర నుంచి ఆ రోజు పోస్టులో వచ్చిన ఉత్తరం చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు. "పెళ్ళే జీవితం కాదు — జీవితమే పెళ్ళి కాదు — పెళ్ళి జీవితంలో ఒక భాగం మాత్రమే — నా కోసం ఆలోచించక, నువ్వు పెళ్ళి చేసుకో !! —" ఉత్తరం మడిచి లోపల దాచాడు జయరామ్, కళ్ళముందు నాన్నరూపం కదులుతుంటే.